క్లుప్తంగా

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



పాఠశాలకు ఫ్యాన్లు అంజేస్తున్న దృశ్యం

కె.గంగవరం: విద్యార్థుల సౌకర్యార్థం స్థానిక ఉన్నత పాఠశాలకు కాకినాడకు చెందిన సీనియర్ జర్నలిస్టు కలగా భాస్కరరామారావు శనివారం మూడు ఫ్యాన్లు బహూకరించారు. పాఠశాలలో ఫ్యాన్ల కొరత ఉందని ఆ పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయిని జి.విజయలక్ష్మి ఆయన దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే మూడు ఫ్యాన్లను హెచ్ఎం పొడగట్లపల్లి వెంకటేశ్వరరావుకు అందించారు. ఉపాధ్యాయులు ప్రక్కి వీరబ్రహ్మానందం, జి.ఏడుకొండలు, ఎ.లక్ష్మి, పి.శ్రీనివాస్, రాఘవకుమారి, విద్యార్థులు దాత రామారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

కె.గంగవరంలో అన్నదానం

కె.గంగవరం: గ్రామంలోని మెయిన్ సెంటర్‌లో భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామస్తులతో పాటు కుందూరు, తామరపల్లి, కోటిపల్లి, కోట తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పొక్లెయిన్ రాకపోకలతో రోడ్డు ధ్వంసమవుతోందని ఫిర్యాదు



రోడ్డుపై ఉన్న పొక్లెయిన్

కాజులూరు: కాకినాడ, కోటిపల్లి ప్రధాన రహదారిపై యథేచ్ఛగా ప్రయానిస్తున్న భారీ పొక్లెయిన్‌ను శనివారం స్థానికులు అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొక్లెయిన్ ఆపరేటర్, సూపర్‌వైజర్‌లను పోలీసులు అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేశారు. వివరాల్లోనికి వెళ్లితే కరప మండలం గొర్రిపూడి నుంచి కాకినాడ, కోటిపల్లి ప్రధాన రహదారి మీదుగా ఒక 200 సీసీ భారీ పొక్లెయిన్ ప్రయానిస్తుంది. ప్రొక్లెయిన్ కారణంగా రోడ్డు ధ్వంసమవుతుండడంతో గొల్లపాలెం మణీ ప్రలావు సెంటర్ ఆవరణలో స్థానికులు అడ్డుకున్నారు. పొక్లెయిన్ ఆపరేటర్, సూపర్‌వైజర్లు పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో ఆగ్రహించిన స్థానికులు గొల్లపాలెం పోలీసులకు సమాచారమందించారు. ఏఎస్సై డేవిడ్ సంఘటన స్థలానికి చేరుకుని పొక్లెయిన్ ఆపరేటర్, సూపర్‌వైజర్‌లను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి వారిపై కేసు నమోదు చేశారు.

ఈ-కేవైసీకి 9 వరకే గడువు

రామచంద్రపురం రూరల్: ఖరీఫ్ 2023కు సంబంధించి రైతులు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని, మండలంలో 12,996 మంది రైతులండగా ఇప్పటివరకూ 9500 మంది ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ ఎన్ సత్యప్రసాద్ తెలిపారు. ఈ-కేవైసీకి సోమవారం వరకే గడువు ఉందని రైతులు త్వరగా చేయించుకోవాలని కోరారు. మండలంలోని వెంకటాయపాలెం రైతు భరోసా కేంద్రాన్ని ఏఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఈ కేవైసీ మండలంలోని 9500 మంది రైతులకు మాత్రమే అయ్యిందని మిగిలిన వారు కూడా త్వరగా నమోదు చేయించుకోవాలని కోరారు.

గర్భిణులకు సీమంతం



కోరుమిల్లిలో గర్భిణులకు పసుపు, కుంకుమ అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: బిడ్డకు జన్మనిచ్చే గర్భిణుల ఆరోగ్యంపైన ఆధారపడి భావి సమాజ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కోరుమిల్లిలో శనివారం ఆయన ఆర్థిక సౌజన్యంతో గ్రామంలోని ఆరు అంగన్‌వాడీ పరిధిల్లో 38 మంది గర్భిణుకు సీమంతం చేశారు. కపిలేశ్వరపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులకు చీర, పసుపు, కుంకుమ, గాజులు, పూలను ఎమ్మెల్సీ తోట చేతుల మీదుగా సంప్రదాయంగా అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ అధికారి గజలక్ష్మి, సూపర్ వైజర్ మాణిక్యం, సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సుంకర వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ ఆచంట వీరవెంకట స్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు సలాది వీరబాబు, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన ఎస్పీ

రంగంపేట: స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా పోలీస్ సూపరింటిండెంట్ (ఎస్పీ) పి.జగదీష్ శనివారం పరిశీలించారు. రంగంపేట పరిధిలో శాంతి భద్రతలు, ఆస్తి నేరాలు, రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వివరాలను గురించి అనపర్తి సీఐ వి.శ్రీనివాస్‌ని, రంగంపేట ఎస్ఐ పి.విజయ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై చర్చించి పలు సూచనలు చేశారు. అంతకుముందు స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులపై ఆరా తీశారు.

సంపూర్ణ ఆరోగ్యాంధ్ర.. సీఎం జగన్ లక్ష్యం

- మంత్రి చెల్లుబోయిన వేణు
- గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష

కాజులూరు: సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ, శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆర్యావటంలో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రుల్లో దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో తపించేవారని గుర్తు చేశారు. ఆ తరువాత ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే పేద, మధ్య తరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వారి ఆరోగ్యానికి వివిధ పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 108 అంబులెస్స్ సేవలు, ఫ్యామిలీ డాక్టర్, 104 వైద్య సేవలు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ కంటి వెలుగు పథకాలను సీఎం జగన్ ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. వీటితో పాటు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 10,032 విలేజ్ హెల్త్ సెంటర్లు, 17 వైద్య కళాశాలలు నిర్మించి, ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో 53,800 మంది స్పెషలిస్టు డాక్టర్లను, నర్సులను నియమించారని చెప్పారు. ప్రజారోగ్యం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున పథకాలు అమలు చేస్తున్నా, ఇంకా గ్రామాల్లోని ప్రజలు చిన్నచిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ క్రమేపీ దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారనే భావనతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వైద్యులతో ప్రజలందరికీ వైద్య పరీక్షలు చేయించి, అవసరమైన వారికి తగు చికిత్స అందించి, ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పిస్తారని మంత్రి వేణు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, ఎంపీపీ మాత భారతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గుబ్బల ఏసురాజు, పీఏసీఎస్ చైర్మన్లు కుడుపూడి సూర్యనారాయణ, సత్తి శ్రీరామారెడ్డి, పితాని సుబ్రహ్మణ్యం, మాత మురళి పాల్గొన్నారు.



ఆర్యావటంలో సురక్ష శిబిరంలో అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది, నాయకులతో మంత్రి వేణు

347 మందికి వైద్యసేవలు

మండపేట: మండలంలోని జెడ్ మేడపాడు గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 347 మందికి వైద్య నిపుణులు వైద్యపరీక్షలు నిర్వహించారు. 63 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన ఈ శిబిరం వద్ద ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఎంపీడీఓ ఐ.రాజు, ఈఓ అమరనాథ్ చౌదరి ఏర్పాట్లు చేశారు. 14 రకాల వైద్య పరీక్షలను రోగులకు ఉచితంగా అందించారు. 105 రకాల బ్రాండెడ్ మందులను అందుబాటులో ఉంచి అవసరమైన రోగులకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, పార్టీ నేత కుడిపూడి రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు తోరం శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు దేవు ప్రసాద్‌నాయుడు, పార్టీ నాయకులు దగ్గర ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి పౌష్టికాహార కిట్లను అందజేశారు. సూపర్‌వైజర్ రత్నకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



కోరుమిల్లిలో వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: పేదల ఇంటికి ప్రభుత్వ వైద్యాన్ని సకాలంలో ఉచితంగా అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కోరుమిల్లిలో శనివారం వాకతిప్ప పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిబిరంలో వివిధ విభాగాల నిపుణులు 587 మందికి చికిత్సనందించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.చంద్రమౌళి, సీహెచ్.రాకేష్ కృష్ణ చౌదరి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మొత్తం 587 మందికి వ్యయులు చికిత్సనందించారు. వారిలో ఆరుగురికి మెరుగైన చికిత్స అవసరమని గుర్తించారు. ఇద్దరికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్స చేయించేందుకు నిర్ణయించారు. శిబిరంలో వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యులు రాకేష్ కృష్ణ చౌదరి, మండపేట బిక్కిన ఆసుపత్రి ఎంఎస్ ఆర్థో వి.కృష్ణ లోకేష్, నారాయణరెడ్డి ఆసుపత్రి ఎండీ జనరల్ మెడిసిన్ రమ్యలక్ష్మి, రామచంద్రపురం అర్బన్ పీహెచ్‌సీ వైద్యులు అనూజ ప్రియాంక చికిత్స చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు సుంకర వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ ఆచంట వీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు సలాది వీరబాబు, సలాది అప్పారావు, పేరాబత్తుల రామకృష్ణ, వింటి సత్తిబాబు, పేరాబత్తుల శివశంకర్, కార్యదర్శి కామేశ్వరరావు, ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండల పరిధిలోని యండగండి సచివాలయం వద్ద శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాట చేసిన సమావేశంలో ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యనికి పెద్దపీట వేసిందని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, తహశీల్దార్ వైద్యనాథ్ శర్మ, సర్పంచ్ చోడే గోవిందు(దత్తుడు), వైద్యులు పార్వతి గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యులు మమత, సందీప్‌నాయుడు, సునీత, మూర్తిలు 352 మందికి వైద్య సేవలు అందించారు. గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఎంపీటీసీ యెన్నం దేవిలు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అవసరమైన వారందరికీ రక్త పరీక్షలు చేశారు. 6 గురిని మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ద్వారా కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. కంటి వైద్య నిపుణుడు ధర్మవరపు కోటేశ్వరరావు 145 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు, కళ్లజోళ్లు అందించారు. ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు సూర్యప్రకాశ్, ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన, తహసీల్దార్ జి.శ్రీనివాసు, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్, నాయకులు



కోరుమిల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్యులు



హసన్‌బాదలో దివ్యాంగుడి చెంతకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సందీప్‌నాయుడు

మాటలు కాదు చేతల్లో చూపే ప్రభుత్వమిది



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట, చిత్రంలో సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- అర్తమూరులో గడప గడపకూ మన ప్రభుత్వం

మండపేట: తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అమలులోకి తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం అర్తమూరు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో యువనేత తోట పృథ్వీరాజ్, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులతో కలిసి గ్రామంలోని రామవరం కాలువగట్టు, సాయిబాబా గుడి వీధి ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలపై అక్కడికక్కడే ఎంపీడీఓ ఐ రాజు, గ్రామ కార్యదర్శి అనిల్‌కుమార్‌తో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో గ్రామంలో ఎక్కడికక్కడ స్థానికులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. తొలుత వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద ఎమ్మెల్సీ తోటకు శ్రీవారి భక్త మండలి చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలుగ్గా స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా ప్రతి ఇంటికి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు, ఎంపీటీసీ సభ్యురాలు మండ సుమలత, యువజన విభాగం నాయకులు గొలుగూరి సందీప్‌రెడ్డి, చిర్ల జయరామ్‌రెడ్డి, వెలగతోడు, అర్తమూరు సొసైటీ చైర్మన్లు ముక్కపాటి కోటేశ్వరరావు, కొవ్వూరి నాగిరెడ్డి, పార్టీ నేతలు మండ నాగిరెడ్డి, కర్రి వీర్రెడ్డి, తేతలి భూపతి రెడ్డి, నల్లమిల్లి రాంబాబు, గొలుగూరి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి, తేతలి సాయి, కర్రి బులిస్వామిరెడ్డి, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనోధైర్యంతో ముందుకు సాగాలి

మండపేట: ఒడిదొడుకులకు కృంగిపోకుండా మనోధైర్యంతో ముందుకు సాగడం ద్వారా విజయాలను సొంతం చేసుకోవచ్చని పట్టణ ఎస్ఐ కె.అప్పారావు అన్నారు. స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎంకేపీ వాణి ఆధ్వర్యంలో శనివారం స్థానిక వైష్ణవి జూనియర్ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ ఆత్మహత్య నిర్మూలన కార్యక్రమంలో ఎస్ఐ అప్పారావు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రాణం పోతే తిరిగిరాదని, ఎంతటి సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. కళాశాల చైర్మన్ కోనే వీర్రాజు, జన విజ్ఞాన వేదిక మండపేట అధ్యక్షుడు పీఆర్సీ రామచంద్రారెడ్డి, ఎంకేపీ వాణిలు మాట్లాడుతూ క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడి కుటుంబ సభ్యులకు విషాదాన్ని మిగల్చరాదన్నారు. వేచి ఉండి ఆలోచనతో కేరీర్‌ను ముందుకు తీసుకువెళ్లాలి విద్యార్థులకు సూచించారు. స్ఫూర్తిని నింపే పలువురి విజయగాథలకు సంబంధించిన కరపత్రాలను విద్యార్థులకు అందజేశారు. బలవన్మరణాలు లేని భారతాన్ని నిర్మిద్దామంటూ విద్యార్థులతో వాణి ప్రతిజ్ఞ చేయించారు. మహిళ పోలీస్ సీహెచ్ వల్లీ, శ్రీదేవి, సుమతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న రామచంద్రారెడ్డి, వాణి తదితరులు

జిల్లాస్థాయి పోటీలకు వెలగతోడు విద్యార్థులు

మండపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాయవరంలో జరిగిన నియోజకవర్గస్థాయి ఆటల పోటీల్లో వెలగతోడు విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. బాలికలు అండర్-17 టెన్నికాయిట్ పోటీల్లో పి. పావని, డిస్కస్‌త్రోలో డి.నాగమణి, యోగలో పి.మనోహరిణి, ఖోఖోలో డి.నాగమణి, కబడ్డీలో టి.సత్య ప్రతిభ కనబరిచారు. అండర్- 14 కబడ్డీలో బి.హైమిష, ఖోఖోలో సాయి ప్రసన్న, ఎ.భవాని, యోగలో ఎస్.కీర్తి విజేతలుగా నిలిచారు. బాలురు అండర్-17 ఖోఖోలో ఆర్.సంతోష్‌కుమార్, కబడ్డీలో దుర్గారావు, షాట్‌పుట్‌లో ఎం.మణికంఠ, రన్నింగ్ 100 మీటర్లు, 400 మీటర్లలో ఆర్.సంతోష్‌కుమార్, అండర్-14 ఖోఖోలో రాంప్రసాద్, సంతోష్‌కుమార్, కబడ్డీలో వినయ్‌సాయిదుర్గ విజేతలుగా నిలిచారని పాఠశాల పీడీ సహదేవుడు తెలిపారు. త్వరలో జరిగే జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను శనివారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి

గుడ్‌మార్నింగ్‌లో మంత్రి వేణు

రామచంద్రపురం: పురపాలక పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని అందించేలా పైపులైన్ నిర్మాణం జరుగుతోందని, త్వరలో కుళాయిలు ఏర్పాటు చేసి మంచినీటిని అందిస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని 2వవార్డు స్టిల్‌విల్‌పేట తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం మంత్రి వేణు గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డుల్లో కుళాయిల ద్వారా వస్తున్న తాగునీటిని పరిశీలించారు. వార్డుల్లో గల హోటల్స్‌ను పరిశీలించి ఆహార పదార్థాల క్వాలిటీపై ఆరా తీసి, తగు సూచనలు చేశారు. టీ స్టాల్స్ వద్ద ఆగి టీ తాగుతూ ప్రజలతో మమేకమయ్యారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులోని బాలుర వసతి గృహాన్ని సందర్శించి ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. హాస్టల్ వార్డెన్‌ను అడిగి తెలుసుకుని నాణ్యత కూడిన పదార్థాలను అందించాలని ఆదేశించారు. కిటికీలను మెస్‌లు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు మంత్రికి విన్నవించారు. వెంటనే మెస్‌లు వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో ప్రజల సహకారించాలన్నారు. వార్డుల్లో తడి చెత్త, పొడి చెత్తలను విడివిడిగా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తలను వేయకూడదని సూచించారు. చిన్న చిన్న టీ స్టాల్స్, హోటల్స్ యజమానులు ఆహార పదార్థాలను పరిశుభ్రతగా ప్రజలకు అందించేలా ఉండాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో కచ్చా డ్రైన్ల నిర్మాణానికి రూ. 12 కోట్లతో మున్సిపాలిటీ అధికారులు ప్రణాళికలు తయారు చేసినట్టు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న, మీ దృష్టికి వచ్చిన చిన్న చిన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. స్వచ్ఛరామచంద్రపురానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. కౌన్సిలర్ కేతా శ్రీను, కో ఆప్షన్ సభ్యుడు గుబ్బల గణ, పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీదర్, పార్టీ నేతలు నున్నబోయిన ప్రసాద్, కంచుమర్తిబాబూరావు, మందపల్లి చిట్టిబాబు, కుడిపూడి గణేష్, కొండేపూడి సురేష్, పోతంశెట్టి గోపాలకృష్ణ, పాలపర్తి మధు, దంగేటి భద్రరావు తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ వద్ద ఆహార పదార్థాల క్వాలిటీని పరిశీలిస్తున్న మంత్రి వేణు

కపిలేశ్వరపురంలో అన్న సంతర్పణ

కపిలేశ్వరపురం: స్థానిక అగ్రహారం వరసిద్ధి వినాయక ఆలయం వద్ద గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

నేడు అప్పలాచార్యర్ సంతాప సభ

రామచంద్రపురం రూరల్: సీనియర్ జర్నలిస్ట్, ద్రాక్షారామ నాటక కళాపరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి, మయూర కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు శృంగారం వేంకట అప్పలాచార్యర్ సంతాప సభ ఆదివారం సాయంత్రం 4 గంటలకు ద్రాక్షారామ పైడా వారి అన్నసత్రంలో నిర్వహించనున్నట్టు ద్రాక్షారామ నాటక కళాపరిషత్ కార్యదర్శి, సినీనటి వై.సరోజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాటక కళాప్రియులు, పాత్రికేయులు, ఆచారి అభిమానులు హాజరుకావచ్చన్నారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు చక్రవర్తుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్న ప్రసాదం స్వీకరించారు. అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి కూడా భక్తులు పోటెత్తారు.

వేంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, నర్సిపూడి, గుమ్మిలేరు గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్త పారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు, వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసిమాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ
- కోలంకలో గడపగడపకూ మన ప్రభుత్వం

కాజులూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతుందని బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కోలంకలో శనివారం రెండో రోజు జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. వలంటీర్లు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరిని పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయనా లేదాని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలను తెలుసుకొని అక్కడిక్కడే పరిష్కరించే ప్రయత్నం చేశారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌కు అందరూ తోడుగా ఉండి వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, స్థానిక పీఏసీఎస్ చైర్మన్ తొగరు శేఖర్‌బాబు, ఎంపీటీసీ పంపన పద్మావతి, రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ దంగేటి అరుణ్‌కుమార్, స్థానిక మాజీ పీఏసీఎస్ చైర్మన్ డీవి నరసింహరాజు, పార్టీ నాయకులు రేమళ్ళ చిట్టియ్య దొరా, దండంగి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



కోలంకలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

వైఎస్ విగ్రహం పరిశీలన

కొత్తపేట: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహాన్ని వెంకటరామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో నెలకొల్పనున్నారు. ఈ విగ్రహం కొత్తపేట వుడయార్ శిల్పశాలలో రూపుదిద్దుకుంటోంది. అనేక యూనివర్సిటీల్లో నెలకొల్పిన వైఎస్సార్ విగ్రహాలు నిలువెత్తువి కాగా, ఉద్యాన విశ్వవిద్యాలయానికి మాత్రం విభిన్నంగా యోగముద్రలో ఉన్న విగ్రహం రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్ ఆ విగ్రహం నమూనా రూపొందించగా గతంలోనే మంత్రి పరిశీలించారు. ఈ విగ్రహం తయారీ పురోగతిని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి శనివారం మరోసారి పరిశీలించారు. శిల్పికి పలు సూచనలు చేశారు. ఏడున్నర అడుగుల ఎత్తున విగ్రహాన్ని, త్వరితగతిన రూపొందించాలని కోరారు. వారి వెంట అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యుడు కె.ధర్మరాజు, ఎంపీటీసీ సభ్యుడు చావలి సుబ్బరాయశాస్త్రి తదితరులు ఉన్నారు.



వైఎస్సార్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, విప్ జగ్గిరెడ్డి తదితరులు

సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కోర్టు నిర్వహణ

సఖినేటిపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం అమలాపురం ఆర్డీవో ఎస్.వసంత రాయుడు సబ్‌డివిజినల్ మేజిస్ట్రేట్ కోర్టును నిర్వహించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న, కలిగించే వారిపైన పోలీసులు 107, 109 చట్టాల కింద నమోదు చేసిన కేసులపై ఆర్డీవో విచారణ చేశారు. ఈ ఏడాది ఒక ఎంసీ కేసుకు సంబంధించి 38 మందితోను, మరొక ఎంసీ కేసుకు సంబంధించి ఏ-పార్టీ 8 మందితోను, బీ-పార్టీ 7 మందితోను ఆర్డీవో కోర్టులో ఆయన విచారణ నిర్వహించారు. తహసీల్దార్ వై.రామకుమారి, డీటీ సీహెచ్ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వి.రామరాజు పాల్గొన్నారు.